01ATP20 F_01ATP20 F.qxd 20-05-2025 PM 10:42 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

బుధవారం 21 మే 2025 పేజీలు : 04

రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను కలిసిన జెసి ప్రభాకర్‌రెడ్డి

- హోం మంత్రిని కలవడంతో ఆంతర్యమేమిటి..?

రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితతో మాట్లాడుతున్న జెసి ప్రభాకర్‌రెడ్డి

అనంతపురం, మే 20 ప్రభాతవార్త బ్యూరో

రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగల పూడి అనితను మంగళవారం అమరావతిలోని సచివాలయంలో తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. హోం మంత్రిని కలిసి ఏ విషయాలు చర్చించారు..? హోం మంత్రికి ఇచ్చిన వినతిపత్రంలో ఏ ముంది అన్నది చర్చనీయాంశంగా మారింది. అనంతపురం జిల్లా తాడిపత్రి శాసనసభ నియోజకవర్గంలో తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మధ్య రసవత్తర రాజకీయం నడుస్తోంది. శాసన సభ ఎన్నికల అనంతరం తాడిపత్రిలో టిడిపి, వైసిపి వర్గాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అప్పటి నుంచి వైసిపి నేత, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రి నియోజకవర్గంలోకి పోలీసులు అడుగు పెట్టనీయడం లేదు, కొన్ని సార్లు పెద్దారెడ్డి తాడిపత్రిలోకి వెళ్లాలని ప్రయత్నించినా పోలీసులు అడ్డుకుంటున్నారు. తాడిపత్రి నియోజకవర్గంలోకి అడుగు పెట్ట నిచ్చే ప్రశ్నేలేదని పలు సందర్భాల్లో తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి హెచ్చరికలు చేస్తూ వస్తున్నారు. వైసిపి హయాంలో టిడిపి వారిని ఎన్నో ఇబ్బందులకు గురి చేశారని, తమ అనుచరుడు రవీంద్రారెడ్డిని జిల్లా బహిష్కరణే చేయించారని జెసి ప్రభాకర్‌రెడ్డి ఆరోపిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కూడా ప్రభుత్వం తీరును పోలీసు అధికారుల తీరును తప్పు బడుతున్నారు. నియోజకవర్గంలోకి అడుగు పెట్టకుండా పోలీసు అధికారులు టిడిపి వారికి కొమ్ముకాస్తున్నారని పెద్దారెడ్డి ఆరోపిస్తున్నారు. ఈ విధంగా టిడిపి, వైసిపి నాయకుల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించి తాడిపత్రి నియోజకవర్గంలోకి వెళ్లే విధంగా షరతులతో కూడిన అనుమతిని ఈ మధ్య కాలంలో పొందారు. అయితే జిల్లాలో సీఎం పర్యటన, తదితర కారణాలు చెబుతూ పెద్దారెడ్డిని తాడిపత్రికి పంపేందుకు పోలీసు అధికారులు ఇప్పటికీ అనుమతి ఇవ్వడం లేదని వైసిపి వర్గాలు చెబుతున్నాయి. ఇదే సమయంలో ఇటీవల తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి పెద్ద వడుగూరు మండలంలో విలేకర్లతో మాట్లాడుతూ.. తాడిపత్రి ఏఎస్‌పి రోహిత్ చౌదరిపై ఆరోపణలు సందించారు. ఏఎస్‌పి రోహిత్ చౌదరి పలు కేసుల విషయంలో చర్యలు తీసుకోవడం లేదని ఆక్రోశం వెల్లగక్కారు. పెద్దవడుగూరులో గ్యాస్ సిలెండర్ల పంపిణీ నిలిచిపోయినా ఏఎస్‌పి చర్యలు తీసుకోలేదని, తాడిపత్రిలో ఒక ఇంజినీరింగ్ కళాశాలపై పలు కేసులు నమోదైనప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని జెసి ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగల పూడి అనితతో తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి బేటి సందర్భంగా ఏం మాట్లాడారన్నది, ఏమి ఫిర్యాదు చేశారన్నది చర్చనీయాంశంగా మారింది.

అనంతపురం అర్బన్ మినీ మహానాడులో గందరగోళం

- టిడిపి ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు వెంకటేశులు ఆత్మహత్యాయత్నం

- ఎమ్మెల్యే పట్టించుకోలేదని ఆరోపణ - వెంకటేశులను బెంగళూరుకు తరలింపు

మినీ మహానాడులో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన టిడిపి నగర ఎస్సీ సెల్ అధ్యక్షులు వెంకటేశులు, ఆసుపత్రిలో బాధితులు వెంకటేశులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దగ్గుబాటి, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం, మే 20, (ప్రభాత వార్త బ్యూరో)

అనంతపురం అర్బన్ నియోజకవర్గ మినీ మహానాడు కార్యక్రమంలో గందరగోళం నెలకొంది. స్థానిక ఎంవైఆర్ కళ్యాణ మండపంలో మంగళవారం అనంతపురం అర్బన్ నియోజకవర్గం మినీ మహానాడు కార్యక్రమంలో అనంతపురం నగర టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు వెంకటేశులు ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఇతర నాయకులు సమావేశానికి హాజరయ్యారు. పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎన్నోసార్లు ఎమ్మెల్యేలు కలిసినా ఎమ్మెల్యే తనను పట్టించుకోలేదని కారణంతో వెంకటేశులు సమావేశం మధ్యలోనే పురుగుమందు సేవించడం నాయకులు కార్యకర్తలు ఆందోళనకు గురయ్యారు. వెంకటేశులు ను వెంటనే టిడిపి కార్యకర్తలు ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స నిర్వహించారు. అనంతపురం నగరంలోని కమ్మ భవన్ లో జరిగిన అర్బన్ నియోజకవర్గ మినీ మహానాడులో ఆత్మహత్యాయత్నం చేసిన టిడిపి కార్యకర్త వెంకటేష్ ను అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పరామర్శించారు.

ఎస్సీ సెల్ విభాగానికి చెందిన వెంకటేష్ క్షణికావేశంలో విష ద్రావకం తాగి ఆత్మహత్యయత్నం చేసుకున్నట్లు, అక్కడ ప్రాథమిక చికిత్సలు అనంతరం ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు టిడిపి వర్గాలు చెబుతున్నా యి .అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ మినీ మహానాడు కార్యక్రమం పూర్తి అయిన తర్వాత ప్రభుత్వాసుపత్రికి, అలాగే సవేరా ఆసుపత్రికి వెళ్లి వెంకటేష్ ను పరామర్శించారు. ఎందుకు ఈ సంఘటన జరిగిందన్న వివరాలు ఆరా తీశారు. అలాగే వెంకటేష్ ఆరోగ్య పరిస్థితి గురించి కూడా వైద్యులనడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉన్నప్పటికీ మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. వెంకటేష్ భార్యను ఎమ్మెల్యే దగ్గుబాటి, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ లు ఓదార్చారు. ఆందోళన చెందవద్దని పూర్తి వైద్య ఖర్చులు తానే భరిస్తానని వెంకటేష్ ఆరోగ్యంగా వచ్చిన తర్వాత అన్ని అంశాలు మాట్లాడుదామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రత్యేకంగా బాధితులు బంధువులకు తెలియజేసినట్లు సమాచారం.

రైతుల సమక్షంలోనే చర్చిద్దాం -ప్రజలకు నిజాలు తెలియచేద్దాం

- ముహూర్తం బుధవారం ఉదయం 11గంటలకు స్థలం జీడిపల్లి రిజర్వాయర్.

- హంద్రీనీవాపై బహిరంగ చర్చపై శివరామిరెడ్డికి కాలవ ఆహ్వానం

ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, మే 20 ప్రభాత వార్త

హంద్రీనీవాపై సమగ్ర వివరాలతో బుధవారం ఉదయం 11 గంటలకు బహిరంగ చర్చకు జీడిపల్లి రిజర్వాయరు వద్ద సిద్ధంగా ఉంటానని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. తమ ప్రభుత్వంపై బురద చల్లుతున్న వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే శివరామిరెడ్డి చర్చకు రావాలని కాలవ ఆహ్వానించారు. రైతుల సమక్షంలో అన్ని విషయాలు చర్చిద్దమన్నారు. రాయదుర్గంలోని తన నివాసంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో బహిరంగ చర్చపై స్పష్టత నిచ్చారు. హంద్రీనీవా పై చర్చకు రావాలని పిలుపునిస్తే శివరామిరెడ్డి స్పందించారన్నారు. అనంతపురంలోని ప్రెస్ క్లబ్ లో ఈనెల 21, 22 తేదీల్లో మీడియా సమక్షంలో చర్చలు జరపటానికి ఆహ్వానిస్తే ఆయన ఉరవకొండ నియోజకవర్గంలో చర్చకు సిద్ధమని అంగీకరించారన్నారు. ఆయన కోర్కె ప్రకారమే ఉరవకొండ నియోజకవర్గ పరిధిలో హంద్రీనీవాకు అత్యంత కీలకమైన జీడిపల్లి రిజర్వాయర్ వద్దనే చర్చిచటానికి సిద్ధమన్నారు. ఆయన మాట ప్రకారమే బుధవారం ఉదయం 11 గంటలకు జీడిపల్లి వద్ద సిద్ధంగా ఆయన రాకకోసం ఎదురు చూస్తానన్నారు.

హంద్రీనీవా ప్రాజెక్టు రూపకల్పన స్థాయి నుండైనా, 1995 తరువాత మారిన ప్రభుత్వాల పాలనలోనైన, వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం లో జరిగిన పనులు అందులో అవినీతి, అక్రమాలపై నైనా, రోశయ్య పాలనలో రఘువీరారెడ్డి చనువుతో జరిగిన అభివృద్ధైనా, విజిలెన్స్, లేదా కాగ్ నివేదికలపై నైనా సరే మాట్లాడేందుకు తాను సిద్ధమని వివరించారు. ప్రజలకు వాస్తవాలు తెలియచేయటానికి ఇదే మంచి అవకాశంగా తాను భావిస్తున్నానని వివరించారు.

అనంతపురంలో ఘనంగా మినీ మహానాడు..

- 23వేలు ఉన్న సభ్యత్వాలు సంఖ్య 78వేలకు చేర్చాం.. - అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్..

- వచ్చే మహానాడుకు అర్బన్‌లో పార్టీ తిరుగలేని శక్తిగా ఎదుగుతుంది - మన పాలనపై ప్రజల్లో సంతృప్తి కనిపిస్తోంది.. ఎంపీ అంబికా..

మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ , మాట్లాడుతున్న ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం అర్బన్, మే 20 ప్రభాతవార్త

టికెట్ సాధించిన 40 రోజుల్లో 40 ఏళ్ల రాజకీయ చరిత్ర ఉన్న నాయకున్ని ఓడించామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. మంగళవారం నగరంలోని కమ్మ భవన్ లో మినీ మహానాడు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అబ్జర్వర్ లక్ష్మినారాయణతో పాటు అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. భారీ స్థాయిలో కార్యకర్తలు తరలిరావడంతో కమ్మభవన్ మొత్తం జనంతో నిండిపోయింది. బయట కూడా భారీ స్థాయిలో కార్యకర్తలు నిల్చుని కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా గత రెండు సంవత్సరాలలో చనిపోయినా కార్యకర్తలకు నివాళులర్పించి, మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టు తర్వాత తెలుగుదేశం పార్టీ ఉంటుందా లేదా అన్న కామెంట్స్ దగ్గర నుంచి 164 స్థానాలతో విజయం సాధించి వైసీపీని నేలమట్టం చేసిందన్నారు. దీనికి ప్రధానమైన కారణం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ అన్నారు. పార్టీలో కష్టపడ్డ ఏ ఒక్కరికి అన్యాయం జరగదని కచ్చితంగా న్యాయం చేస్తామని అన్నారు. కోటి సభ్యత్వాలతో దేశంలో ఏ ప్రాంతీయ పార్టికి లేనన్ని సభ్యత్వాల రికార్డును సాధించారన్నారు. కేవలం వంద రూపాయలు కడితే 5లక్షల భీమా సౌకర్యం కల్పించారన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో మరణించిన 5మంది కార్యకర్తల కుటుంబాలకు ఒక్కొక్కరికి 5లక్షల వరకు సాయం అందిందన్నారు.

మినీ మహానాడుకు హాజరైన టిడిపి నేతలు, కార్యకర్తలు

గతంలో ఎప్పుడూ లేని విధంగా అభివృద్ధి : గత ఐదేళ్లలో అనంతపురం అర్బన్ నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిందని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక అనంతపురం జిల్లాపై ప్రత్యేకంగా దృష్టి సారించారన్నారు. ఇటు రాప్తాడు, అటు అనంతపురంలో ఇద్దరు వైసీపీ ఎమ్మెల్యేలు ఉన్నా గత ఐదేళ్లలో రుద్రంపేట రోడ్డు పూర్తి చేయాలేకపోయారన్నారు. అది నేను ఎమ్మెల్యే అయ్యాకనే చేశానన్నారు. అందుకే ఈ 11 నెలల కాలంలోనే 165 మందికి రెండు కోట్ల రూపాయలు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసినట్లు వివరించారు. అనంతపురంలో ఇప్పటికే 35 కోట్లతో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామని, మరో 30 కోట్ల పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ 750కోట్లతో నిర్మిస్తామన్నారు. నడిమి వంకకు ప్రొటెక్షన్ వాల్ 80కోట్లతో త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. అక్టోబర్ 2 నాటికి డంపింగ్ యార్డ్ లో చెత్త లేకుండా చేస్తామని స్పష్టం చేశారు. డంపింగ్ యార్డును నగర సమీపంలో మరో ప్రాంతానికి తరలిస్తామని ఇందుకు అనుమతులు కూడా వచ్చాయన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నీ నెరవేరుస్తున్నామన్నారు. గాడితప్పిన ఆర్థిక వ్యవస్థను సరి చేస్తూ.. ఇప్పటికే మెగా డీఎస్సీ, అన్న క్యాంటీన్లు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు వంటివి చేశామన్నారు. వచ్చే నెలలో ప్రతి రైతుకు 20వేల రూపాయలు అన్నదాత సుఖీభవ కింద సాయం, ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా అమ్మకు వందనం కింద 15వేల ఆర్థిక సాయం, ఆగష్టు 15నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం మిగతా 4 లో...

స్వయం శక్తితో మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి

నల్లమాడ మే 20 ప్రభాతవార్త,

స్వయం శక్తితో మహిళలు అన్ని రంగాలలో రాణించాలని స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మ ంత్రి పల్లె రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నల్లమాడ మండలంలోని రెడ్డిపల్లి లో బీసీ కార్పొరేషన్ ఆర్థిక సహాయ సహకారంతోతో మహిళలకు ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తో కలసి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, ప్రతి మహిళా ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే స్వయం ఉపాధి ఎంతో అవసరం అన్నారు. కుటుంబ పోషణ జరగాలంటే మహిళల పాత్ర ఎంతో కీలకం అన్నారు. ప్రభుత్వం ఎంతో మంచి ఉద్దేశంతో కల్పించిన ఉచిత కుట్టు శిక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ మహిళా సాధికారత తోనే దేశ అభివృద్ధి సాధ్యమన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే ఆ దేశం ,రాష్ట్రం పురోగ భివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. మహిళా సాధికారత కోసం ఆనాటి ముఖ్యమంత్రిగా అన్న నందమూరి తారకరామా రావు హయంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్, అడ బిడ్డలకు ఆస్తి హక్కు తీసుకొచ్చిన ఘనత ఎన్టీఆర్ కు దక్కుతుందని అన్నారు. అదే బాటలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పయనిస్తున్నా రని పేర్కొన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో మహిళలకు ఉపాధి పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం తరఫున కృషి చేస్తామని తెలిపారు. పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ మాట్లాడుతూ, మహిళలు సొంత కాళ్లపై నిలబడడానికి ఇలాంటి ఉచిత కుట్టు శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రతి మహిళ ప్రభుత్వం కల్పించిన 90 రోజులపాటు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని సూచించారు. భవిష్యత్తులో ఉపాధి పరిశ్రమలు ఏర్పాటు చేసే దిశగా ప్రతి మహిళ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మైలే శివశంకర్ టిడిపి సీనియర్ నాయకులు దొన్నికోట కేశవరెడ్డి, రమణ ,సలాం ఖాన్ , మైలే రామచంద్ర, ప్రసాద్ రెడ్డి, గుండ్ల శివారెడ్డి, మధుసూదన్ రెడ్డి, గన్ రెడ్డి, నాయుడు, బుట్టి నాగభూషణం నాయుడు, మహిళ కన్వీనర మనీ తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం.

యోగాంధ్ర-2025 కార్యక్రమాల్లో అందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలి

-జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు, యోగా సాధకులు, స్వచ్ఛంద సంస్థలకు జిల్లా కలెక్టర్ పిలుపు

-జిల్లాలో సింగల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాం -జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, మే 20 ప్రభాతవార్త

యోగాంధ్ర -2025 కార్యక్రమాల్లో అందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని, జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు, యోగా సాధకులు, స్వచ్ఛంద సంస్థలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగాంధ్ర క్యాంపెయిన్-2025, పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత, జిల్లా యంత్రాంగం తీసుకునే చర్యలపై జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మే 21వ తేదీ నుండి జూన్ 21వ తేదీ వరకు యోగాంధ్ర-2025 క్యాంపెయిన్‌ను నెల రోజులపాటు యోగా మంత్‌గా నిర్వహించడం జరుగుతుందన్నారు. యోగా చేయడం వల్ల అందరూ ఆరోగ్యంగా, ఆనందంగా జీవించేందుకు వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. యోగాంధ్ర-2025 కార్యక్రమంపై ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా వారు విరివిగా ప్రచారం చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వచ్ఛ ఆంధ్ర జ- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. పెద్ద పెద్ద షాపుల యజమానులు పెద్ద డస్ట్ బిన్లను తయారుచేసి బయట పెట్టుకోవాలన్నారు. అనంతపురం నగరాన్ని ఆహ్లాదకరమైన పట్టణంగా తయారు చేయాలని, ఇందుకు జిల్లా ప్రథమ పౌరుడిగా తాను కూడా పాటిస్తానని, ప్రజలు, అధికారులు స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాలన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయరాదని, అనంతపురం మున్సిపాలిటీ ఎన్ఫోర్స్మెంట్ వాహనం త్వరలో ఏర్పాటు చేస్తామని, అందులో అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేసి అధికంగా రుసుములు విధిస్తారన్నారు. అందరూ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ఉద్దేశాన్ని అర్థం చేసుకొని పరిశుభ్రమైన పట్టణం, పరిశుభ్రమైన జిల్లాను తయారు చేసేందుకు భాగస్వామి కావాలన్నారు. నగరంలో ఇప్పటికే 56 షాపులకు నోటీసులు జారీ చేయడం జరిగిందని, సింగల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధిస్తున్నామని, ఇందుకు సంబంధించి పబ్లిక్ నోటీస్ కూడా జారీ చేశామన్నారు. ప్లాస్టిక్‌ను వినియోగిస్తే బుధవారం నుండి షాపులపై జరిమానాలను కూడా వసూలు చేస్తామన్నారు. ప్లాస్టిక్ వినియోగిస్తే షాపుల వారికి మొదటిసారి 2,500 రూపాయలు, రెండోసారి 5 వేలుతో పాటు షాప్ సీజ్ చేయడం, ప్లాస్టిక్ వస్తువులు కలిగి వుంటే మొదటిసారి 20 వేలు రెండోసారి 40 వేల రూపాయలు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. పెద్ద షాపులు అయితే 25 వేలు మొదటిసారి రెండవ సారి 50 వేలు జరిమానా విధించడంతో పాటు వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమీషనర్ బాలస్వామి, డిఎంహెచ్ఓ డాక్టర్ ఈబి.దేవి, జిల్లా టూరిజం అధికారి జయకుమార్‌బాబు, డిఎస్‌డిఓ ఉదయ్‌భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో సెక్టోరియల్ పోస్టులకు రీ-నోటిఫికేషన్...!

- గత నోటిఫికేషను రద్దు చేసిన ఎస్సీడీ - జూన్ 12 లోపు భర్తీ ప్రక్రియను పూర్తి చేసేందుకు సన్నద్ధం

అనంతపురం న్యూటౌన్, మే 20 ప్రభాతవార్త

సమగ్రశిక్ష సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టులు భర్తీ కోసం గతంలో జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ ఎస్సీడీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ పోస్టులకు కొత్త నిబంధనలు రావడంతో ఆ విధంగా రీ-నోటిఫికేషన్ ద్వారా ఖాళీ పోస్టులను భర్తీ చేయడానికి జిల్లా కలెక్టర్‌కు దాదాపు నెల క్రితమే ఫైల్‌ను పంపించారు.

అనంతపురం సమగ్రశిక్షలో గత ఎడాది ఆగస్టు నుండి ఏఎంవో, జీసీడీవో (సెక్టోరియల్), అసిస్టెంట్ ఏఎంవో, అసిస్టెంట్ ఏఎంవో (కన్నడ), అసిస్టెంట్ సీఎంవో, అసిస్టెంట్ అలెర్టో, అసిస్టెంట్ ఐఈడీ, ఏఎస్‌వో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆ పోస్టులను భర్తీ చేయడానికి ఆగస్టు మొదట్లోనే జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఆ తర్వాత దరఖాస్తులు పరిశీలన, ఆ తర్వాత అసిస్టెంట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికైన అభ్యర్థుల జాబితాను రాష్ట్ర సమగ్రశిక్ష కార్యాలయానికి పంపించారు. అలా ఆ ప్రక్రియ దాదాపు మూడు నెలల పాటు కొనసాగింది. ఆ తర్వాత కొన్ని నెలలు ఎంపిక జాబితా విడుదల కాలేదు. కొన్ని నెలల క్రితం నలుగురు అభ్యర్థులను ఎంపిక చేసినట్లు ఎస్సీడీ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఆ నియామకాలు సక్రమంగా జరగలేదని, వాటిని రద్దు చేసి కొత్తగా రీ-నోటిఫికేషన్ ఇవ్వాలని రాష్ట్ర ఉన్నతాధికారులను ప్రజా ప్రతినిధులు కోరినట్లు తెలిసింది. అయితే అప్పుడు ఆ నియామకాలను, ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ దాదాపు నెల క్రితం ఎస్సీడీ ఉత్తర్వులు జారీ చేశారు. అంతే కాకుండా సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టులకు కొత్త నిబంధనలను పెట్టారు. ఆ విధంగానే ఇతర జిల్లాల్లో కూడా సెక్టోరియల్, అసిస్టెంట్ పోస్టులు భర్తీకి ఎస్సీడీ అనుమతులు ఇచ్చారు. అనంతపురం జిల్లాలో మిగతా 3 లో...

లేపాక్షిలో మండల సర్వసభ్య సమావేశం

- నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి - ఎంపిపి వెంకటరత్నమ్మ

లేపాక్షి, మే 20 ప్రభాతవార్త

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ నరసింహమూర్తి

మండల కేంద్రమైన లేపాక్షిలోని వెలుగు కార్యాలయంలో ఎంపిపి వెంకటరత్నమ్మ అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ఎంపిడిఓ నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై అధికారులు గ్రామాల్లో ప్రచారం చేయాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. ప్రభుత్వ పథకాలపై సంబంధిత గ్రామాల్లో అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏఇ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుతం సబ్సిడీతో సోలార్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకొనేందుకు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి శ్రీలత మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం అమలుకు అవసరమైన వేలిముద్రలను రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో వేయాలని సూచించారు. అదేవిధంగా పశువైద్యాధికారి డాక్టర్ కిషోర్, ఏపిఎం జయచంద్ర, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఇ దివ్య, డాక్టర్ వెంకట చిరంజీవి తదితరులు ఆయా శాఖల్లో అభివృద్ధిని వివరించారు. అనంతరం మండల ఉపాధ్యక్షులు అంజనరెడ్డి, కంచిసముద్రం ఎంపిటిసి నాగరాజు, కోడిపల్లి ఎంపిటిసి గంగాధర్‌లు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల్లో లేపాక్షి మండల పరిషత్ అభివృద్ధికి ఎన్ని నిధులు వచ్చాయి, ఏఏ గ్రామానికి ఏఏ పనులకు ఎంత నిధులు మంజూరు చేశారు, ప్రస్తుతం మిగిలిన నిధులు ఎంత అన్న వివరాలను వారం రోజులలోపు రాతపూర్వకంగా ఇవ్వాలని ఎంపిడిఓ నరసింహమూర్తిని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు వసంత, భాగ్యమ్మ, నాగజ్యోతి, గంగమ్మ, సర్పంచులు రామచంద్రారెడ్డి, ఆదినారాయణ, రత్నమ్మ, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

కోడి కత్తి కేసులో మాజీ సీఎం జగన్ కోర్టుకు రావాల్సిదే

ప్రముఖ న్యాయవాది సలీం

రాయదుర్గం,మే 20 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ లో సంచలనం సృష్టించిన కోడికత్తి కేసులో మాజీ సిఎం వైస్ జగన్మోహనరెడ్డి న్యాయస్థానాలను ను గౌరవించి కోర్టుకు హాజరుకావాలని ప్రముఖ న్యాయవాది సలీం పేర్కొన్నారు మంగళవారం సొంత పనులమీద రాయదుర్గం వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు ఒక దళిత యావకుడిని అక్రమంగా కేసులో ఇరుక్కోవడంతో అతని భవిషత్ కు అన్యాయం జరిగిందన్నారు కోడికతి కేసు ద్వారా జగనకు రాజకియంగా నష్టం జరిగిందన్నారు ఇప్పటికయినా జగన్ కోర్టు కు వచ్చి సాక్ష్యం చెప్పాలని కోరారు జగన్ కోర్టు కు వచ్చే వరకు తాను నిద్రానన్నారు గాలి జనారరెడ్డికి పడింట్టే జగనకు కూడా శిక్ష తప్పఫన్నారు ఈ సందర్భందా అడ్వికెట్ రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి బోయ మురళి మునిసిపల్ మాజీ వైస్ చైర్మెన్ కడ్డీపూడి మహబూబ్బషా పాల్గొన్నారు.

బోయ మారెప్ప మృతదేహానికి నివాళులర్పించిన ఎంపీపీ

బ్రహ్మ సముద్రం మే 20 ప్రభాతవార్త



నివాళులర్పిస్తున్న దృశ్యం

మాజీ ఎంపీ కళ్యాణ దుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య ఆదేశాల మేరకుబ్రహ్మ సము మండలం పిల్లల పల్లి గ్రామంలో వైసిపి కార్యకర్తబోయ మారెప్ప 73 సంవ త్సరాలు అనారోగ్యంతో మృతి చెందారు విషయం తెలుసుకొని మృహదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు కుటుంబ సభ్యులకు రాగాడ సానుభూతి తెలియజేసిన ఎంపీపీ కంభం చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ గోవిందప్ప, టవల్ వెంకటేశులు, మాజీ డీలర్ తిమ్మరాయుడు తదితరులు వైసీపీ కార్యకర్తలు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

10వ తరగతి సప్లిమెంటరీ హిందీ పరీక్షకు 118 మంది గైర్హాజరు

- 169 మందికిగాను కేవలం 51 మంది విద్యార్థులు మాత్రమే హాజరు

ఉరవకొండ, మే 20 ప్రభాతవార్త

10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా మంగళవారం రెండవరోజు జరిగిన హిందీ పరీక్షకు 118 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఐదు పరీక్షా కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 169 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా కేవలం 51 మంది మాత్రమే హాజరు కావడం విశేషం. స్థానిక ఎస్.కె.ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంల్లో 36 మందికిగాను ఏడుగురు మాత్రమే హాజరుకాగా 28 మంది గైర్హాజరయ్యారు. జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 26 మందికిగాను ఆరుగురు హాజరుకాగా 20 మంది గైర్హాజరయ్యారు. జెడ్పీ బాలికోన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 24 మందికిగాను 9 మంది హాజరుకాగా 15 మంది గైర్హాజరయ్యారు. వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాల కేంద్రంలో 41 మందికిగాను 15 మంది హాజరుకాగా 26 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 43 మందికిగాను 14 మంది హాజరుకాగా 29 మంది గైర్హాజరయ్యారు.

వర్షానికి తడిసిన వేరుశనగ పంటలు

ప్రభుత్వం ఆదుకోవాలంటున్న బాధిత రైతులు

కనగానపల్లి మే 20 ప్రభాతవార్త

వర్షానికి తడిసిన వేరుశనగ పంటను చూపుతున్న రైతు వి.ప్రసాద్.

మంగళవారం మండలంలోని రైతులు రబి సీజన్లో వేరుశనగ పంటను ఎక్కువ మంది సాగు చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు తొలగించిన వేరుశనగ పంట పొలాల్లోనే వర్షానికి తడిసి ముద్దవుతున్నాయి. అలాగే మద్దెల చెరువు గ్రామానికి చెందిన రైతు వారాదుల ప్రసాద్ ఐదెకరాల్లో ఐదు క్వింటాల్ వేరుశనగ విత్తనాలతో వేరుశెనగ పంటను సాగు చేశాడు. ఇటీవల పంటను తొలగించాడు. పంట చేతికి వస్తుందన్న సమయంలోనే ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో వేరుశనగ కట్టి కాయలు పొలంలోని తడిసి కుళ్ళిపోయాయని దీంతో నాలుగు లక్షల రూపాయలు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు ప్రసాద్ వాపోతున్నాడు.

రాకెట్లలో 'బేటి బచావో - బేటి పడావో' కార్యక్రమం

-అవగాహన కల్పించిన హెల్త్ ఎడ్యుకేటర్, సీహెచ్‌వో

బేటి బచావో-మేటీ పడావో కార్యక్రమ దృశ్యం

ఉరవకొండ, మే 20 ప్రభాతవార్త

మండల పరిధిలో ని రాకెట్ల గ్రామంలో మంగళవారం రాకెట్ల పీహెచ్‌సీ ఆధ్వర్యం లో బేటి బచావో- బేటి పడావో అవగా హన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ మహ మ్మద్ షఫీ, సీహెచ్‌వో నాగరంగయ్య మాట్లాడుతూ కొందరు ఆడపిల్లలను చదివించకుండా, సరైన వివాహ వయసు రాకుండానే బాల్య వివాహాలు చేస్తున్నారని ఇది సరైంది కాదన్నారు. పుస్తకాలు మోసే వయసులో పుస్తుల భారం వద్దని సూచించారు. చిన్న వయసులో వివాహం చేయడంవల్ల అమ్మాయిలకు శారీరక, మానసిక సమస్యలు ఎదురై ఆరోగ్యం క్షీణిస్తుందని, గృహహింస, లైంగిక హింసలకు దారితీస్తుందన్నారు. బాల్య వివాహాలవల్ల అమ్మాయిల చదువు పాడవుతుందని, భవిష్యత్తు అంధకారం అవుతుందన్నా రు. పుట్టబోయే పిల్లలపై ప్రతికూల ప్రభావంపడి బరువు తక్కువ, చనిపోయిన, అనారోగ్యం పిల్లలు పుట్టడం లాంటివి జరుతాయన్నారు. ఈ సందర్భంగా పీసీ పీఎన్‌డీటీ చట్టం గూర్చి వివరిస్తూ గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు, బ్రూణ హత్యలు చట్టరిత్యా నేరమని అవగాహన కలి ్పంచారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత, స్టాఫ్ నర్సులు సునీత, జీనతున్నిసా, కుమారిబాయి తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండలో ఇక మరింత పకడ్బందీగా ఇంటింటికీ చెత్త సేకరణ

-నూతన ట్రై సైకిల్ రిక్షాల ప్రారంభోత్సవంలో డీఎల్‌పీవో

ఇంటింటికీ చెత్త సేకరణకోసం నూతనంగా కొనగోలు చేసిన ట్రై సైకిల్ రిక్షాలను ప్రారంభిస్తున్న దృశ్యం

ఉరవకొండ, మే 20 ప్రభాతవార్త

ఉరవకొండ పట్టణంలో ఇక మరింత పకడ్బం దీగా ఇంటింటికీ చెత్త సేకరణ కొనసాగుతుందని డీఎల్‌పీవో విజయ్ కుమార్‌రెడ్డి అన్నా రు. ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీ పరిధి లో ఇంటింటి చెత్త సేకరణ

నూతనంగా కొనగోలు చేసిన ట్రై సైకిల్ రిక్షాలు

నిమిత్తం 2.5 లక్షల రూపాయల వ్యయంతో కొత్తగా 10 ట్రై సైకిల్ రిక్షాలను మేజర్ గ్రామపంచాయతీ కొనగోలుచేయగా సర్పంచ్ మీనుగలలిత అధ్యక్షతన మంగళవారం పంచాయతీ కార్యాలయంవద్ద జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్, ఈవోఆర్‌డీ పి.సతీష్‌కుమా ర్‌లతో కలిసి జెండా ఊపి నూతన ట్రై సైకిల్ రిక్షాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా డీఎల్‌పీవో విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ పట్టణాన్ని శుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యతని చెత్తా చెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా ఇంటివద్దకు వచ్చే పారిశుద్ధ్య సిబ్బందికి చెత్తను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్, వార్డు సభ్యులు పి.నిరంజన్‌గౌడ్, వేల్పుల వాసుదేవుడు, ఎం.రవికుమార్, ఎం.రామాంజినేయులు, పి.శర్మస్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

దళిత విద్యార్థి జేమ్స్‌పై అమానుష దాడి హేయమైన చర్య

-ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ డివిజినల్ సభ్యులు కౌకుంట్ల రవి

ఉరవకొండ, మే 20 ప్రభాతవార్త

విలేఖరులతో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ డివిజినల్ సభ్యులు కౌకుంట్ల రవి

కులం పేరుతో దూషించవద్దని చెప్పినందుకు బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న దళిత విద్యార్థి జేమ్స్‌ను కిడ్నాప్‌చేసి అమానుషంగా దాడిచేసి విచక్షణా రహితంగా కొట్టి, హింసించి, మూత్రం తాగించడం అత్యంత హేయమైన చర్యని దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదుచేసి కఠినంగా శిక్షించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ డివిజినల్ సభ్యులు కౌకుంట్ల రవి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఉరవకొండలో విలేఖరులతో మాట్లాడారు. తిరుపతి జిల్లా చంద్రగిరి సమీపంలోని ఒక కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న జేమ్స్‌ను తన జూనియర్ యశ్వంత్ నాయుడు తరచూ కులం పేరుతో దూషిస్తూ అవమానిస్తుండగా ఇది సరైందని కాదని చెప్పినందుకు కక్ష కట్టుకొని కొందరు రౌడీ షీటర్లతో కలిసి జేమ్ ్సను బలవంతంగా కారులో ఎక్కించుకొని వెళ్లి హాకీ స్టిక్స్, రాడ్లతో ఇష్టం వచ్చినట్లు కొట్టి కత్తితో గాయపర్చి మూత్రంపోసి తాగించి అమానవీయంగా వ్యవహరించారని ఇది క్షమించరాని నేరమన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచిపోతుండగా ఇంకా దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నాయని, చదువుకునే చోట కూడా దళిత విద్యార్థులు కుల వివక్షతకు గురవుతుండటం ప్రతిఒక్కరూ సిగ్గు పడాల్సిన విషయమన్నారు. మరోమారు ఇలాంటి ఘటనలు జరుగకుండా ఉండాలంటే జేమ్స్‌పై దాడిచేసి హింసించి అమానవీయంగా, అమానుషంగా వ్యవహరించిన వారిని కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉందన్నారు. అంతే కాకుండా జేమ్స్, అతని కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండి రక్షణ కల్పించాలని కౌకుంట్ల రవి కోరారు.

సోలార్ విద్యుత్తు వల్ల రాష్ట్రానికి విద్యుత్ ఆదా కలెక్టర్ టీఎస్ చేతన్

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్ చేతన్

శ్రీ సత్యసాయి జిల్లా మే 20 ప్రభాతవార్త ప్రతినిధి :

ప్రతి ఇంటి పైకప్పు పై ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ రూప్ టాప్ నిర్మించుకుంటే రాష్ట్రానికి విద్యుత్ ఆదా చేసిన వారవుతామని కలెక్టర్ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం సాయి అరామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పీఎం సూర్యఘర్ పథకంపై నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ టీఎస్ చేతన్ పాల్గొన్నారు. కలెక్టర్ తో పాటు ఎమ్మెల్యే సింధూర రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్సీ సంపత్

నమూనా సోలార్ ప్లాంట్ ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కుమార్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ ఆదాతో పాటు మిగులు ఉత్పత్తి చేయవచ్చున్నారు. ప్లాంట్ ఏర్పాట చేసుకునేవారికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు ఇస్తున్నాయన్నారు. ప్రస్తుతం వెయ్యి రూపాయల వరకు వచ్చే విద్యుత్ బిల్లు సోలార్ ఏర్పాటు చేసుకుంటే 350 రూపాయల లోపు మాత్రమే బిల్లు వస్తుందన్నారు. అంతేగాక ప్రభుత్వమే మిగిలింది విద్యుత్ కొనుగోలు చేస్తుందన్నారు. దీని ద్వారా ప్రభుత్వాలకి ప్రజల విద్యుత్తు సరఫరా చేసే పరిస్థితి ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే సింధూర రెడ్డి మాట్లాడుతూ సోలార్ ఎనర్జీని వినియోగించుకుని గృహ అవతురాల కోసం వాడుకుని మిగిలిన విద్యుత్ గ్రిడ్డుకు అమ్ముకోవచ్చు అన్నారు. పుట్టపర్తిని గ్రీన్ ఎనర్జీ గా మార్చడమే ధ్యేయమన్నారు.మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెడుతుందన్నారు. అంతకుముందు సోలార్ ప్లాంట్ నమూనాను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు ,జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, కూటమి నాయకులు విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

జూదరులు అరెస్టు

జూదరులను చూపుతున్న పోలీసులు

బెలుగుప్ప, మే 20 ప్రభాతవార్త

బెలుగుప్ప మండలపరిధిలోని గంగవరం గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరు మందిని అరెస్టు చేసినట్లు ఏఎస్ఐ రామదాసు తెలిపారు. వారి వద్ద నుంచి 23,200 రూపాయలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేస్తామని తెలిపారు.

అక్రమ మద్యాన్ని ధ్వంసం చేసిన పోలీసులు

పుట్టపర్తి రూరల్ మే 20 ప్రభాతవార్త

ధ్వంసం చేసిన మద్యంతో పోలీస్ అధికారులు

పుట్టపర్తి జిల్లా ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో పట్టుబడిన అక్రమ మద్యాన్ని మంగళవారం డిప్యూటీ కమీషనర్ అఫ్ ప్రొహిబిషన్ , ఎక్సైజ్ అనంతపురం వారి ఆదేశాల మేరకు ధ్వంసం చేశారు. పుట్టపర్తి జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి, గోవింద్ నాయక్ వారి ఆధ్వర్యంలో పుట్టపర్తి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వివిధ కేసుల్లో పట్టుబడిన కర్ణాటక మధ్యము, (133.2 లీటర్లు) ఆంధ్ర మధ్యము (112.3 లీటర్లు) నాటు సారాయి(28 లీటర్స్) కల్లు (8 లిటర్లు) ను ఎక్సైజ్ పోలీస్ సిబ్బంది , పంచాయతీ సిబ్బంది సమక్షములో బ్రాహ్మణపల్లి దంపింగ్ యార్డ్ సమీపంలో మద్యాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పుట్టపర్తి ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ సురేష్, ఎక్సైజ్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పద్యాల పోటీలు

తాడిపత్రిటౌన్, మే 20 ప్రభాతవార్త

తాడిపత్రిశాఖ గ్రంథాలయంలో మంగళవారంవిద్యార్థులకు పద్యాల పోటీలను నిర్వహించారు. సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. పిల్లలు చిన్నతనం నుండి పుస్తకపఠనం అలవాటుగా మార్చుకోవాలనితెలియచేశారు, అనంతరం కథలు చెప్పించడం, పుస్తక పఠనం, డ్రాయింగ్ నేర్పించడం జరిగింది. తదుపరి పిల్లలు పాటలకు డాన్స్‌చేశారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.రవికుమార్‌నాయుడు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో

-రైతులకు వడ్డీ కట్టించుకొని బ్యాంకు రుణాలు రెన్యూవల్ చేయాలని డిమాండ్

ఉరవకొండలోని ప్రధాన కూడలిలో రాస్తారోకో నిర్వహిస్తున్న రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఉరవకొండ, మే 20 ప్రభాతవార్త

వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్రవ్యాప్త గ్రామీణ హర్తాళ్లలో భాగంగా మంగళవారం ఉరవకొండ పట్టణంలోని కవితా హోటల్ కూడలిలో రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు రాస్తారోకో నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎ.రంగారెడ్డి, బి.బాలరంగయ్య, నాయకులు పెద్దముష్టూరు వెంకటేష్, రైతు సంఘం డివిజినల్ నాయకులు బి.జ్ఞానమూర్తి మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం 3వ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు కార్మిక వ్యవసాయ హక్కలపైన దాడి చేస్తూ రైతులకు వ్యతిరేకంగా నల్లచట్టాలను తీసుకొచ్చి మోసం చేసిందన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సరఫరా చేయకుండా రైతులు వ్యవసాయమే దండగ అనే పరిస్థితులు తీసుకొచ్చారన్నారు. వ్యవసాయ కూలీలకు వరంలా ఉన్న ఉపాధిహామీ పథకానికి నిధులు తగ్గించి, చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా నెలల తరబడి ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి 200 రోజులు పనులు కల్పించి కూలీలకు రోజువారి వేతనం 600 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు జరిగిన పనులకు బిల్లులు, కూలీలకు వేతనాలు చెల్లించాలని, పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించి పనిముట్లను పంపిణీ చేయాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరుచేసి బ్యాంకుల ద్వారా వడ్డీలేని రుణాలు అందించాలని, దేవాలయ భూములను దళితులకు, పేదలకు కౌలుకు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి అన్నదాత సుఖీభవ డబ్బు 20వేల రూపాయలు ఒకేసారి రైతుల ఖాతాలో జమ చేయాలన్నారు. రైతులతో వడ్డీ మాత్రమే కట్టించుకొని రుణాలు రెన్యూవల్ చేయాలని, ఖరీఫ్ పంట కాలంలో రైతులకు రాయితీతో ఒక పాసు పుస్తకానికి 5 బస్తాలు వేరుశెనగకాయలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు సుంకన్న, సిద్దప్ప, రవి, వీరాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండలో రెండు ఎఫ్‌పీ షాపులపై 6ఏ కేసు నమోదు, సీజ్

-నిల్వలు తక్కువగా ఉండటంతో చర్యలు తీసుకున్నామన్న తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా

ఎఫ్‌పీ షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా, సీఎస్‌డీటీ బి.రాము సిబ్బంది

ఉరవకొండ, మే 20 ప్రభాతవార్త

ఉరవకొండ పట్టణంలోని 6, 21 నంబర్‌గల ఎఫ్‌పీ షాపులపై నిత్యవసరాల సరకుల చట్టం 1955 సెక్షన్ 6ఏ కింద కేసులు నమో దు చేయడం జరిగిం దని మండల తహశీ ల్దార్ ఎస్.మహబూబ్ బాషా మంగళవారం తెలిపారు. ప్రజల నుండి వచ్చిన పిర్యాదుల మేరకు రెండు ఎఫ్‌పీ షాపులపై దాడులు నిర్వహించగా రెండింటిలోనూ ఉండాల్సిన నిల్వల కంటే తక్కువ నిల్వలు ఉండటంతో ఈ చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. 6వ ఎఫ్‌పీ షాపు డీలర్ మని, 21వ ఎఫ్‌పీ షాపు డీలర్ బుడెన్‌సాబ్‌లకు నోటీసులు జారీ చేసి తదుపరి చర్యల నిమిత్తం జాయింట్ కలెక్టర్ కోర్టుకు, ఆర్డీవోకు పంపడం జరిగిందని వివరించారు. ఈ దాడుల్లో సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ బి.రాము, స్థానిక వీఆర్‌వోలు పాల్గొన్నారు.

ఉరవకొండలో ఘనంగా జూ.ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

-ప్రత్యేక పూజలు, కేక్ కటింగ్, మిఠాయిల పంపిణీ

ఉరవకొండ, మే 20 ప్రభాతవార్త

జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా ప్రధాన కూడలిలో కేక్ కట్ చేస్తున్న అభిమానులు

ఉరవకొండ పట్టణంలో మంగళవారం జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన అభిమానులు ఉదయం స్థానిక గవిమఠ సంస్థానంలోని గవిసిద్దేశ్వరస్వామి ఆలయంలో జూనియర్ ఎన్టీఆర్ పేరుమీద ప్రత్యేక పూజలు, అర్చనలు చేయించారు. అనంతరం స్థానిక కవితా హోటల్ కూడిలిలో కేక్‌ను కటిచేసి మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ జూనియర్ ఎన్టీఆర్ యూనివర్సల్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్ తన నటన, డాన్సులతో అభిమానులను అలరిస్తూ యువతకు, నేటి తరాలకు స్ఫూర్తినిచ్చే మరెన్నో సందేశాత్మక చిత్రాలలో నటించాలని ఆయన సినీ జీవితం దిగ్విజయంగా కొనసాగాలని కోరుకొంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ వీరాభిమానులు ఈడిగ వేణుగౌడ్, కేతి మల్లి, టి.వీరేష్, మణిచౌదరి, చెన్నకేశవులు, మురళి, మహేష్, చాంద్‌బాషా, మణి, బాబు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ప్రాజెక్టుకు భూముల పరిశీలన

అగళి, మే 20 ప్రభాతవార్త

తహశీల్దారు కార్యాలయంలో సమీక్షిస్తున్న రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్

అగళి మండలంలో సోలార్‌ప్రాజెక్టు నిర్మాణానికి రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ భూములను పరిశీలించారు. రైతులతో మాట్లాడి అనంతరం తహశీల్దారు కార్యాలయాన్ని పరిశీలించారు. సోలార్‌పవర్ ప్రాజెక్టుకోసం భూములను పరిశీలించిన తహశీల్దారు సుబ్బారావు ఈ సందర్భంగా వారికి తెలిపారు. సోలార్ పవర్ ప్రాజెక్టుకు మండలంలో భూములను గుర్తించినట్లు తెలిపారు.

03ATP20_03ATP20.qxd 20-05-2025 PM 10:59 Page 1

4 లేబర్ కోడ్స్‌ని రద్దు చేసి కార్మిక చట్టాలను కొనసాగించాలి
- కార్మిక సంఘాల నేతలు

అనంతపురం న్యూటౌన్, మే 20 ప్రభాతవార్త

కార్మికులకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, ఎఐఎఫ్‌టియు (న్యూ) రాష్ట్ర కార్యదర్శి కిషోర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాలు మే 20న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె దేశంలో పరిమాణాల వలన జూలై 9కి వాయిదా వేసినట్లు వారు తెలిపారు. మంగళవారం జరగాల్సిన సమ్మె బదులు బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి, ఓబులు, కిషోర్ మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడానికి మే 20న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు సార్వత్రిక సమ్మె చేపట్టాయని దేశంలో జరుగుతున్న పరిణామాల వలన జూలై 9 కి వాయిదా పడిందన్నారు. కేంద్రంలో మూడవ సారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక హక్కులను పూర్తిగా హరించిందన్నారు. కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వ లెక్కలు చెబుతున్నా అమలు జరగడం లేదన్నారు. అవుట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కేంద్రం లో 8వ, రాష్ట్రంలో 12వ వేతన సంఘం ఏర్పాటు చేయాలన్నారు. కార్మిక చట్టాలను కొనసాగించి లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. కేంద్రం విధానాలు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసే విధంగా ఉన్నాయన్నారు. ప్రైవేటీకరణ విధానాలు నిలుపుదల చేసి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలన్నారు. సుప్రం కోర్టు సూచన మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. పర్మినెంట్ కార్మికులకు బకాయి ఉన్న డిఏలు, సరెండర్ లీవ్స్ ఏన్‌క్యాష్‌మెంట్లు వెంటనే ఇవ్వా లన్నారు. స్కీం వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఆటో, హమాలీ, వీధివ్యా పార స్థులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాల న్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిం చాలన్నారు.ఇతర డిమాండ్లపై జూలై 9న జరుగు సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి మల్లికార్జున, సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేంద్ర, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్, వైఎస్ఆర్ టియుసి జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు ఏసు రత్నం, ఎఐఎఫ్ టియు జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు, ఎఐటియుసి నగర ప్రధాన కార్య దర్శి కృష్ణుడు, సిఐటియు నగర కార్యదర్శి ముత్తూజా, వైఎస్ ఆర్‌టి యుసి నగర అధ్యక్షులు ఖాజా, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ముందు నిరన తెలుపుతున్న దృశ్యం

ఉపాధి కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి
- కరువు జిల్లా శ్రీ సత్య సాయిలో ఉపాధి దినాలు 200 చేయాలి.
- ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం శ్రీ సత్య సాయి జిల్లా కార్యదర్శి బి.కదిరప్ప

నంబులపూలకుంట, మే 20 ప్రభాతవార్త

మ్పహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా కరువు జిల్లా శ్రీ సత్య సాయి జిల్లాలో పనిచేస్తున్న కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించాలని, వేతనదారులకు, కార్మికులకు పనికి సమాన వేతనం కల్పిస్తూ వారికి ఇన్సూరెన్స్, ఇతర అలవెన్సులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం శ్రీ సత్య సాయి జిల్లా కార్యదర్శి బి.కదిరప్ప డిమాండ్ చేశారు. మంగళవారం నంబుల పూలకుంట మండలం ఎన్ రెడ్డి వారిపల్లి గ్రామ సమీపంలోని కొట్టకుంటలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలతో ఆయన సమావేశమై కార్మిక చట్టాల గురించి వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కార్యక్రమం చేపడుతోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయించేదని, కానీ మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటి నుండి నిధులు తగ్గిస్తూ ప్రస్తుతం 86 కోట్లకు తెచ్చిందని తెలిపారు. పని ప్రదేశాలలో కనీసం ప్రథమ చికిత్స కిట్లను కూడా పోవడం ఈ ప్రభుత్వం కూలీలు, కార్మికులపట్ల చూపుతున్న నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. వేసవిలో నీడ, మంచినీరు, మజ్జిగను వేతనదారులకు ప్రభుత్వమే అందించాల న్నారు. పనిదినాలు 200 రోజులకు పెంచుతూ, ప్రథమ చికిత్స కిట్లను అందుబాటులో ఉంచాలి. ప్రతి వేతనదా రునికి ప్రభుత్వమే ఇన్సూరెన్స్ చేయిం చాలి. నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ పెరగడం తో కూలీలు, కార్మికులు, రైతు లు,సామాన్య ప్రజలకు భారం అవుతున్న దని,ఉపాధి హామీ పథకంలో వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇంటి పట్టాలు మంజూరుచేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి రమణ, సిపిఐ మండల కార్యదర్శి జి.రమణ ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మయ్య, మల్లిరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, లాలూ సాబ్,రేణికేశ్వర్ రెడ్డి, అమ్మజాన్, గోవిందమ్మ, రమణమ్మ, ఫకీర్ బి,సరస్వతి, స్వాతి, లక్ష్మిదేవి,రామమోహన్ రెడ్డి,వెంకటయ్య,రమణ తదితర ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న దృశ్యం

వ్యవసాయ రుణాలను మాఫీ చేయండి
- జిల్లా రైతు సంఘం అధ్యక్షులు డి.చిన్నప్ప యాదవ్

శింగనమల, మే 20 ప్రభాతవార్త

.రైతులు వ్యవసాయ కూలీలు వ్యవసాయ కార్మికుల రుణాలను మాఫీ చేయాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షులు డి.చిన్నప్ప యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్నిడ ఇమాండ్ చేశారు. మంగళవారం సంయుక్త కిసాన్‌మోర్చ పిలుపు మేరకు మండల పరిధిలోని కల్లుమడి గ్రామంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులతో కలిసి నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 2014 సంవత్సరం నుంచి రైతు లు, వ్యవసాయ కూలీలు కార్మికుల పట్ల అత్యంత కర్కషంగా వ్యవహరి ంచడం జరుగుతోందని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం లేదని ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోతే పెద్ద ఎత్తున పోరాటాలు చేసినా రైతు లను ఆదుకోవడం లేదని ఆయన విమర్శించారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సు మేరకు సి2 పస్లస్ 50 ప్రకారం మద్దతు ధరలు అమలు చేయాల ని, లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని, నూతన పాలసీ మార్కెట్ సౌకర్యాన్ని రద్దు చేయాలని, వెనుకబండిన ప్రాంతాలకు సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్య త నిచ్చి నిధులను పెంచాలన్నారు. ఉపాధి పని దినాలు 200లకు పెంచాలని 600 కూలీ పెంచాలని, 90 శాతం సబ్సిడిపై విత్తన వేరుశనక్కాయలు, సబ్సిడి విత్తనాలు, చిరుధాన్య విత్తనాలు రైతులకు సకాలంలో అందించాలన్నారు. ఈ కార్యక్ర మంలో చేనేత మండల కార్యదర్శి చేనేత మధు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి చికెన్ బాషా, నారప్ప, రామ సుబ్బారెడ్డి, మధు రెడ్డి, మసూద్‌వలి, నాగరాజు, శంకర, కృష్ణమూర్తి, మల్లికార్జున, బా షా, నల్లక్క, లక్ష్మక్క, వెంక టేష్, పుల్లయ్య, కృష్ణ తదితరులు పాల్గొ న్నారు.

ర్యాలీ చేస్తున్న సిపిఐ నేతలు

కర్ణాటక మద్యం స్వాధీనం

అనంతపురం వైద్యం మే 20 ప్రభాతవార్త అనంతపురం నగరంలోని రాజీవ్ కాలనీలో అక్రమంగా నిల్వ ఉంచిన కర్ణాటక కు చెందిన 384 టెట్రా ప్యాక్ ల మద్యాన్ని అనంతపురం ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ ఇన్స్పెక్టర్ సత్య నారాయణ ఆధ్వర్యంలో దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. హాజీ వలి అనే వ్యక్తి వద్ద పెద్ద ఎత్తున కర్ణాటక మద్యం ఉందని సమాచారంతో ఈ దాడులు నిర్వహించి అనంతరం నిందితుడిని రిమాండ్ కు తరలించినట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు అక్రమమద్యాన్ని కొనుగోలు చేసిన విక్రయించిన కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమం లో ఎస్సై లు జయ నరసింహ ,జాకీర్ హుస్సేన్ ,కృష్ణారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు

కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ శాఖ సిబ్బంది

భారీగా బెల్లపుఊట, నాటు సారా ధ్వంసం

అనంతపురం వైద్యం, మే 20 ప్రభాతవార్త

ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ సూపరిండెండెంట్ రామ్మోహన్ రెడ్డి ఆదేశాలతో ఎక్సైజ్ శాఖ ఎన్ఫోర్స్మెంట్ విభాగం టాస్క్ ఫోర్స్ విభాగం కళ్యాణ దుర్గం రాయదుర్గం కంబదూరు ఎక్సైజ్ శాఖ అధికారులతో సంయుక్త ఆపరేషన్‌లో భాగంగా కంబదూరు మండలం అండేపల్లి గ్రామ పరిసరాలలో 200 లీటర్ల బెల్లపు ఊట పది లీటర్ల నాటు సారాను ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ అధికారులు గుర్తించి ధ్వంసం చేశారు అండేపల్లి గ్రామానికి చెందిన ఎరుకుల శివ అనే వ్యక్తి నాటు సారా కాస్తున్నాడని సమాచారంతో ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించి నాటు సారాను ధ్వంసం చేశారు.

ఎక్సైజ్ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న నాటు సారా బెల్లపు ఊట

వాహనాల వేలం : అక్రమ మద్యం కేసులో పట్టుబడి సీజ్ చేయబడిన 6 ద్విచక్రవాహనాలను,1 ఆటోను ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వాహనాలను వేలంవేగా ప్రభుత్వానికి రూ.41 వేల ఆదాయం సమకూరింది. అలాగే స్టేషన్ పరిధిలో సీజ్ చేసిన 430 లీటర్ల అక్రమ మద్యాన్ని ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో గుంతకల్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శివసాగర్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు

విద్యా ప్రమాణాలను పెంచేందుకు సమావేశం ఏర్పాటు చేయాలి - రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్

అనంతపురం న్యూటౌన్, మే 20 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం విద్య పరిరక్షణ కమిటీ, పాధ్యాయ సంఘాలు ప్రజా సంఘాలతో కలిపి మేధావుల సమావేశం ఏర్పాటు చేయాలని, అలాగే ఉపాధ్యాయుల కేటాయింపులో ఈ క్రింది విషయాలను గమనంలోకి తీసుకోగలరని రిజర్వేషన్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, విద్య పరిరక్షణ కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. విలేఖరుల సమావేశంలో డా.రామచంద్ర మాట్లాడుతూ..ఫౌండేషన్ పాఠశాలల్లో 1, 2 తరగతులకు నమోదు 20 దాటిన దగ్గర రెండవ ఎస్టీటీ ఇవ్వాలి. బేసిక్ పాఠశాలలో నమోదు 41 దగ్గర 3వ పోస్ట్ ఇచ్చి, నమోదు 45 దగ్గర నాలుగు పోస్టులు ఇవ్వడం కంటే బేసిక్ పాఠశాలల్లో 20:1 ప్రధానం.నమోదు 60 నుంచి ఆదర్శ ప్రాథమిక పాఠశాలను ఆహ్వానిస్తున్నాము. అయితే, అందుకొరకు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను బలహీనపరచరాదు. 6,7,8 అప్పర్ ప్రైమరీ సెక్షన్లు నమోదు 60 వరకు 4గురు, 61 నుండి 75 వరకు 5గురు స్కూల్ అసిస్టెంట్లు, 76 నుంచి 100 వరకు 6 స్కూల్ అసిస్టెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డా. రామచంద్ర, డా. ముచ్చుకోట సురేష్ బాబు, ఆర్వీఎస్ నాయకులు జీవీ ఉజ్వల్, పౌర స్పందన వేది క నాయకులు ప్రొ జి. వెంక టశివారెడ్డి తదితరులు రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

లీగల్ మెట్రాలజీ శాఖ అవగాహన సదస్సు

అనంతపురం న్యూటౌన్, మే 20 ప్రభాతవార్త

ప్రపంచ మెట్రాలజీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా మర్చంట్స్‌తో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యాపారులు, సాధారణ ప్రజలు భాగస్వామ్యమయ్యారు. కొనుగోలు విషయంలో జరుగుతున్న మోసాలు, వాటిపై చట్టపరమైన చర్యలు, వినియోగదారులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో విస్తృతంగా తెలియ జేశారు. అలాగే వ్యాపారస్తులు తూనికలు-కొలతల విషయంలో పాటిం చవలసిన అంశాలపై అవగాహన కల్పించడం జరిగినది. సదస్సులో భాగంగా వ్యాపారస్తులకు అవగాహన కల్పించేందుకు పాంప్లెట్‌లు పంపిణీ చేయబడి, తగిన నిబంధనలపై చరి చారు. ఈ కార్యక్రమం ప్రజల్లో చట్టపర మైన అవగాహనను పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషించింది. సదస్సులో ఆసిస్టెంట్ కంట్రోలర్ సుధాకర్, ఇన్స్పెక్టర్ వై.జి.శంకర్, ఇన్స్పెక్టర్ యం.మహమ్మద్ గౌస్, ఇన్స్పెక్టర్ వైజి.శంకర్, సీనియర్ టెక్నికల్ ఆసిస్టెంట్ పి.శ్రీనివాసులు, టెక్నీకాల్ అసిస్టెంట్ యం.మహమ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి ఇంటి ఫీవర్ సర్వే సక్రమంగా జరగాలి

అనంతపురం వైద్యం మే 20 ప్రభాతవాఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని ఇంటింటి ఫీవర్ సర్వేను సక్రమంగా జరిగే లాగా చూడాలని మలేరియా సబ్ యూనిట్ అధికారులను జిల్లా మలేరియా యూనిట్ అధికారి ఓబులు ఆదేశించారు మంగళవారం డిఎం అండ్ హెచ్ ఓ కార్యాలయంలో మలేరియా సబ్ యూనిట్ అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు అధికంగా కురుస్తున్న తరుణంలో దోమలు అధికమవుతాయని అలాంటి ప్రాంతాలను గుర్తించి గంబుసియా చేపలను వదలాలని, మలేరియా వ్యాధి ప్రబలకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ సమావేశంలో ఎం పి హెచ్ ఓ లు కే గిరిధర్ రెడ్డి ,బత్తుల కోదండరామిరెడ్డి టి .రమేష్, కే .మునాఫ్, శ్రీనివాసులు, మద్దయ్య తిరుపాల్, రామకృష్ణ ,హెల్త్ సూపర్వైజర్లు నూర్ భాషా శ్రీధర్ లోకేశ్వర్ రెడ్డి పోచం రెడ్డి రాఘవేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు .

త్వరలో సెక్రోరియల్ పోస్టులకు రీ-నోటిఫికేషన్...!

మొదటిపేజి తరువాయి.... కూడా సెక్రోరియల్, అసిస్టెంట్ సెక్రోరియల్ పోస్టులను భర్తీ చేయడానికి రీ-నోటిఫికేషన్‌కు కూడా అనుమతి ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో సమగ్రశిక్ష డీపీసీ, ఏసీసీ రీ-నోటిఫికేషన్‌కు అనుమతి ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌కు దాదాపు నెల క్రితమే ఫైల్‌ను పంపించారు. ఆ ఖాళీ పోస్టులను నూతన విద్యా సంవత్సరం ప్రారంభం (జూన్ 12) లోపు భర్తీ చేయాల్సివుంది. ఈ నేపథ్యంలో రీ-నోటిఫికేషన్‌కు జిల్లా కలెక్టర్ నుండి అనుమతి వచ్చిన వెంటనే త్వరలో రీ-నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నట్లు విద్యాశాఖ, సమగ్రశిక్షలో తీవ్ర చర్చ జరుగుతోంది.

ప్రస్తుతం ఒక్క ఏపీవో మాత్రమే ః

గత ఎడాది ఆగస్టు నుండి రెండు సెక్రోరియల్, ఆరు అసిస్టెంట్ సెక్రోరియల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అందులో ఇన్‌ఛార్జ్ ఏఎంవోగా పనిచేస్తున్న టీచర్ చంద్రశేఖర్‌రెడ్డి, అసిస్టెంట్ సీఎంవో రిఫ్యూటేషన్ అయిన తర్వాత కూడా డిప్యూటేషన్ మీద కొనసాగుతూ ఏప్రిల్ 23న రిలీవ్ అయ్యి పాఠశాలలో జాయిన్ అయ్యారు. ఇక ఇన్‌ఛార్జ్ జీసీడీవోగా పనిచేస్తున్న శెట్టూరు ఎంఈవో-2 వాణిదేవి కూడా తనకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు వద్దని దాదాపు మూడు నెలల క్రితమే లెటర్ రాసిచ్చి రిలీవ్ అయ్యారు. ఏపీవో నారాయణస్వామి ఫారిన్ సర్వీస్ గడువు కూడా జనవరి నాటికే పూర్తి అయ్యింది. అయితే అతన్ని ఏపీవోగానే కొనసాగించాలని అక్కడ పనిచేస్తున్న ఓ అధికారి పట్టుపట్టి వచ్చే జనవరి వరకు కొనసాగేందుకు ఉత్తర్వులను తెప్పించడం జరిగింది. అందువలన సమగ్రశిక్షలో అసిస్టెంట్ సెక్రోరియల్ (ఏపీవో) ఒక్కరే పనిచేస్తున్నారు. అయితే సమగ్రశిక్షలో ఎనిమిది సెక్రోరియల్, అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉండటంతో ఆయా విభాగాల్లో తాత్కాలికంగా పనిచేయడానికి ఇటీవల నలుగురు టీచర్లను డిప్యూటేషన్ మీద తీసుకున్నారు. త్వరలో విడుదల అయ్యే రీ-నోటిఫికేషన్‌లో ఖాళీ పోస్టులు మొత్తం భర్తీ కానున్నాయి.

కార్పొరేషన్ లో పని వాతావరణం కల్పించండి
- ఆఫీసు పనివేళ్లలో సీట్లు ఖాళీగా ఉంటున్నాయి - రెండు నెలలుగా విధులు గైర్హాజరైన బాలాజీ పై చర్యలు చేపట్టండి కమాండ్ కంట్రోల్ లో సీనియర్ అసిస్టెంట్ , జూనియర్ అసిస్టెంట్ చేసేంత పని ఏముంది : కమిషనర్ బాలస్వామి

అనంతపురం మే 20 ప్రభాతవార్త

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉద్యోగులు సీట్లలో ఉండి పనిచేస్తున్నారన్న వాతావరణ కల్పించాలని కమిషనర్ భీమిశెట్టి బాలస్వామి ఉద్యోగులకు సూచించారు. మంగళవారం స్థానిక కౌన్సిల్ హాలులో అన్ని విభాగాల ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో కమిషనర్ తో పాటు డిప్యూటీ కమిషనర్ డాక్టర్ పావని, సూపరిండెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు ఒక్కో ఉద్యోగి కార్యాలయంలో నిర్వహించే పనుల గురించి ఆరా తీశారు. టౌన్ ప్లానింగ్ లో్జ 3 క్లర్కుగా పనిచేస్తున్న బాలాజీ మార్చి ఒకటో తేదీ నుంచి విధులకు రావటం లేదని తెలియడంతో కమిషనర్ అవాక్కయ్యారు డిస్పాచ్ లో లీవ్ లెటర్ ఇచ్చేసి లాంగ్ లీవ్ వెళ్లిపోయాడని ఎస్టాబ్లిష్మెంట్ క్లర్క్ శరత్ కమిషనర్ కు తెలిపారు కమీషనర్ బాలస్వామి మాట్లాడుతూ అనారోగ్యం ఉంటే ఉన్నతాధికారిని కలిసి లీవ్ లెటర్ మంజూరు కై సంతకం తీసుకుని లాంగ్ లీవ్ తీసుకుని వెళ్లాల్సి ఉంటుందన్నారు అయితే లాంగ్ లీవ్ కై డిస్పాచ్ విభాగంలో లెటర్ ఇచ్చి వెళ్లడం సరికాదన్నారు. మార్చి ఒకటి నుంచి విధులకు హాజరు కాకుండా జీతాల బిల్లు అతనికి ఎవరు చేస్తున్నారని ఎలా చేస్తున్నారని వాకబు చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన బాలాజీ పై సస్పెన్షన్ కై చర్యలు చేపట్టాలని డిప్యూటీ కమిషనర్ పావని నీ కమిషనర్ ఆదేశించారు అలాగే సీనియర్ అసిస్టెంట్ వేణుగోపాల్ పేరుకు మూడు సీట్లు నిర్వహిస్తున్న ప్రావిడెంట్ ఫండ్ కు సంబంధించి నెలలుగా పెండింగ్లో ఉంచుతూ కమిషనర్ దృష్టికి తీసుకుని రాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిం చడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు కమిషనర్ పని ఒత్తిడిలో ఉన్నా డని, అందుబాటులో లేదని కుంటి సాకులు చెప్పకుండా చేంబర్ వద్ద వేచి ఉండి కమిషనర్ సంతకాలు తీసుకుని వెళ్లాలని సూచించారు ప్రావిడెంట్ ఫండ్ ఎంత అవసరం ఉంటే లోను తీసుకోవాలని ఉద్యోగులు వేచి ఉంటారని ఆ విషయం గుర్తుంచుకొని విధులు నిర్వహించాలని సూచించారు అలాగే మెప్మా గుమాస్తా యుగంధర్ రెడ్డిని ఆయన విధుల గురించి ఆరా తీసిన తర్వాత కమిషనర్ మాట్లాడుతూ కమర్షియల్ పనులు ఏవైనా ఉంటే ఆఫీసు పనివేయ డం ముగిసిన తర్వాత చూసుకోవాలని అంతేకానీ కార్యాలయ పని వేళల్లో సీట్లలో లేకుండా బయట వ్యాపారాలు చేసుకోవద్దని హెచ్చరించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదును తీసుకోవటానికి ఒక సీనియర్ అసిస్టెంట్ కృష్ణమూర్తి మరో జూనియర్ అసిస్టెంట్ వెంకటేష్ విధులు నిర్వహించడంపై కమిషనర్ బాలస్వామి విస్మయం వ్యక్తం చేశారు సీనియర్ అసిస్టెంట్ కృష్ణమూర్తి తో కమాండ్ కంట్రోల్ రిజిస్టర్ తెప్పించి ఫిర్యాదులను జాబితాను పరిశీలించారు ఏప్రిల్‌లో 13 ఫిర్యాదులు మే నెలలో 10 ఫిర్యాదులు నమోదైన విషయం పరిశీలించారు ఇంత పెద్ద పనికి షిఫ్టుల వారిగా సీనియర్ అసిస్టెంట్ కృష్ణ మూర్తి జూనియర్ అసిస్టెంట్ వెంకటేష్ పనిచేయాల్సిన అవసరం లేదని అన్నారు. వీరిని ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అటాచ్ చేయాలని డిప్యూటీ కమిషనర్ కు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విధులు నిర్వహించే నల్లప్ప ఫిర్యాదులను ఆన్లైన్ చేసే రసీదు ఇస్తున్న విషయాన్ని తె ప్పించి అలా విధులు నిర్వహిం చాలని వారికి సూచించారు వారిలో జూనియర్ అసిస్టెంట్ వెంకటేష్ మధ్యా హ్నం షిఫ్ట్ కు వస్తారని చెప్పటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు సీటు క్లర్క్ రాజేంద్రప్రసాద్ బాబును స్కూల్‌లలో పనిచేసే రికార్డు అసిస్టెంట్లు గుమా స్తాలు పనిచేస్తున్నా రని కమిషనర్ ప్రశ్నించగా సమ్మర్ హాలిడేస్ అని బాబు బదులిచ్చారు. అంటే సమ్మర్ హాలిడేస్ లో క్లర్కు కూడా విద్యార్థులతో పాటు సెలవులు ఉంటాయా వారు విధులకు రాకుండానే జీతాలు తీసుకుంటు న్నారా అని ప్రశ్నించగా సమాధానం కరువైంది. విద్యా విభాగం సూపరిం డెంట్ సాలమ్మను స్కూల్లో సిబ్బంది పనితీరును పర్యవేక్షిస్తున్నారని ప్రశ్నించగా ఆమె నుంచి సమాధానం కరువైంది. ఇప్పటినుంచైనా ఎవరెవరు ఎక్కడెక్కడ ఏమేమి విధులు నిర్వహిస్తున్నారు సమాచారం సేకరించి తన వద్దకు తీసుకురావాలని కమిషనర్ సాలమ్మను ఆదేశించారు అలాగే. రెవెన్యూ విభాగంలో పనిచేసే నారాయణ స్వామి మూడు సీట్లు పనిచేస్తున్నానని చెప్ప టంతో అన్ని సీట్లలో అంత పని ఉంటుందా ఏమేం పని చేస్తు న్నారో వాటిని పరిశీలించి పర్యవేక్షి ంచాలని కమిషనర్ బాలస్వామి డిప్యూటీ కమిషనరు ను ఆదేశించారు. ఉద్యోగులలో అధిక శాతం మంది సీనియర్ అసిస్టెంట్ పేరుకు రెండు మూడు సీట్లు నిర్వహిస్తున్నామని చెప్పటమే గాని అక్కడ చేస్తున్న పని ఏమీ లేదని అన్నారు. పేరుకు రెండు మూడు సీట్లు చేస్తున్నామన్న మాటే కానీ ప్రజల సమస్యలు ఎక్కడికక్కడ పెండింగ్‌లో ఉంటున్నాయని వాటి పరిష్కా రం దిశగా అడుగులు పడటం లేదని అన్నారు ఇప్పటినుంచి అయినా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఉద్యోగులు సీట్లలో ఉండి ప్రజలకు పని చేసే వాతావరణం కల్పించాలని కమిషనర్ ఉద్యోగులను హెచ్చరించారు.

మాట్లాడుతున్న కమిషనర్ బాలస్వామి

హాజరైన ఉద్యోగులు

కళ్యాణదుర్గం సమగ్ర అభివృద్ధికి కట్టుబడి పని చేస్తా
తెలుగుదేశం పార్టీ విజయం కోసం శ్రమించిన కార్యకర్తలు తలెత్తుకుని తిరిగేలా అభివృద్ధికి బాత్రులు వేస్తా - మినీ మహానాడు ద్వారా రాష్ట్ర మహానాడుకు నివేదించిన తీర్మానాలను వచ్చే మహానాడు లోపల పూర్తి చేసేందుకు కృషి చేస్తా

కళ్యాణదుర్గం, మే 20 ప్రభాతవార్త :

తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉన్న కళ్యాణదుర్గం నియోజకవర్గంలో కార్యకర్తలు ప్రజలు తనపై ఎంతో నమ్మకం ఉంచి కళ్యాణదుర్గం అభివృద్ధి కోరుతూ బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిపించాలని ప్రజలందరి రుణం తీర్చుకునేలా కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తానని, పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్త తలెత్తుకొని తిరిగేలా పాటు పడతానని, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. మంగళవారం రాత్రి ప్రజా వేదికలో నిర్వహించిన మినీ మహానాడుకు కళ్యాణ్ దుర్గం రూరల్ మండల అధ్యక్షులు గోళ్ళ వెంకటేశులు అధ్యక్షత వహించారు. ఈ సమావేశం లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే సురేంద్రబాబు మాట్లాడుతూ కళ్యాణ దుర్గం నియోజకవర్గం నియోజకవర్గం అయిన కుందుర్పి బ్రాంచ్ కెనాల్ ద్వారా 114 చెరువులకు సాగునీరు అందించే పథకాన్ని హామీ ఇచ్చిన మేరకు రెండు వందల శాతం పూర్తి చేస్తానని హర్షధ్వనాల మధ్య ప్రకటించారు. ప్రతిపక్షాల విమర్శలకు తాను వెనుకడుగు వేసేది లేదని ఇచ్చిన మాట నేలవేచ్చేందుకు కృషి చేస్తానన్నారు. అంతేకాకుండా తిమ్మసముద్రం వద్ద 1110 ఎకరాల ఏపీఐఐసీ ప్రభుత్వ భూమిలో పరిశ్రమల స్థాపనకు ఇటీ

క్రీడ స్ఫూర్తిని చాటండి క్రీడాకారులకు ఎమ్మెల్యే కాలవ పిలుపు

డి.హీరేహాల్, మే 20 ప్రభాతవార్త

గ్రామీణ యువ క్రీడాకారులు తమలోని క్రీడా ప్రతిభను చాటుకోవడానికి కాలవ క్రికెట్ లీగ్ పోటీలు ఓచక్కటి వేదికని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు యువతకు పిలుపు నిచ్చారు. మంగళవారం డి.హిరేహాళ్ మం డల కేంద్రంలో కాలవ క్రికెట్ లీగ్ పోటీలను ప్రారంబించిన అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం, దేహదారుడ్యం లాంటి ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని ఎమ్మెల్యే కాలవ ఈ సందర్భంగా పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని దేశం గర్వించదగ్గ అత్యుత్తమ క్రీడాకారులు చాలా మంది మట్టి లోని మానిఖ్యాల్లా గ్రామస్థాయి నుండే వచ్చిన వారేనని ఆయన సూచిం చారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో క్రీడ ప్రతిభ కలవారిని ప్రోత్సహి ంచాలన్న ఉద్దేశంతో మండల స్థాయిలో ఆటల పోటీలు నిర్వహించి నియోజ కవర్గం, జిల్లా, రాష్ట్ర, దేశస్థాయికి క్రీడా పోటీల్లో పాల్గొనాలన్న సదుద్దేశం తోనే ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కాలవ క్రికెట్ లీగ్ పోటీల్లో పాల్గొనడానికి నియోజకవర్గ వ్యాప్తంగా 205 జట్లు పోటీ పడుతున్న నేపథ్యంలో డి.హిరేహాళ్, బొమ్మన హాళ్, కనేకల్లు, గుమ్మగట్ట, రాయదు ర్గం పట్టణం, రాయదుర్గం రూరల్ మండలాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు. మండల స్థాయి విజేతలకు రూ. 30వేలు, రన్నర్స్‌కు రూ. 15వేలు బహుమతి ఉంటుందని, నియోజకవర్గ స్థాయిలో జరిగే ఫైనల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్టుకు రూ.1లక్ష, రన్నర్స్‌కు రూ. 50వేలు నగదు బహుమతి ఉంటుందని ఫైనల్ లో గెలు పొందిన జట్టుకు నగదుతో పాటు ఎన్టీఆర్ ట్రోపీ అందించడం జరు గుతుందని ఆయన తెలిపారు. క్రీడాకారులు తమలోని ఉత్తమ క్రీడా స్ఫూర్తినీ ప్రదర్శించాలని గెలుపు, ఓటములు ప్రతిఒక్కరూ సమానంగా స్వీకరించాలని ఏజట్టు విజయం సాధించిన అందరూ మన రాయదుర్గం నియోజకవర్గ వాసులేనని ఆయన ఈసందర్భంగా గుర్తుచేశారు. జట్టు తరపున ఆడటం వల్ల తోటివా రితో ఎల మెలగాలో తెలుస్తుందని, అలాగే గెలుపోటములు జీవితంలో ఎదురయ్యే సవాళ్లను, ఆటుపోట్లను ఎలా ఎదు ర్కోవాలి, ఎలా నిగ్రహిం చుకోవాలి అన్న జీవిత సత్యాలను నేర్పుతా యని ఎమ్మెల్యే యువతకు సూచించారు. స్నేహ పూరిత వాతావరణంలో అందరూ కలసిక ట్టుగా ప్రతి క్షణం క్రీడా స్ఫూర్తిని ఆస్వాదించాలని ఎమ్మెల్యే యువతకు హితువు పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొ రేషన్ డైరెక్టర్ నాగళ్ళి రాజు, మండల కన్వీనర్ హను మంతరెడ్డి, సీనియర్ తెదేపా నాయకులు శ్రీరాములు, తిమ్మయ్య, బొజ్జయ్య, సెట్రు విజయకుమార్, కనిగిరి వన్నూరు స్వామి, తాయప్ప, రాజు, శంకరప్ప, కోటి బసవరాజు, సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ లీగ్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే కాలవ

యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యే కాలవ

రాష్ట్రం పురోగమన దిశగా దూసుకుపోవాలంటే చంద్రబాబు సారధ్యమే శరణ్యం

- కష్టపడిన ప్రతి తెలుగు సైనికునికి గుర్తింపు నిస్తాం - బడుగు బలహీన వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిన ఘనత స్వర్గీయ ఎన్టీఆర్ - మినీ మహానాడులో స్పష్టం చేసిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి, మే 20 ప్రభాతవార్త

ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో రాష్ట్రం పురోగమన దిశగా దూసుకుపోతోందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ స్పష్టం చేశారు. స్థానిక పివిఆర్ ఫంక్షన్ హాల్లో మంగ ళవారం కదిరి నియోజకవర్గ మినీ మహానాడు ఎమ్మెల్యే కందికుంట ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గ టిడిపి కార్యకర్తలను నాయకులు ఉద్దేశించి ఎమ్మెల్యే కందికుంట మాట్లాడుతూ.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు సముచిత న్యాయం కల్పించారన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అంది స్తున్న ఘనత మన ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కిం ద న్నారు. తెలుగుదేశం పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు నాయకునికి తప్పక గుర్తింపు లభిస్తుం దన్నారు. నా 25 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో ఒడిదు డుకులు, ఆటుపోట్లు ఎదుర్కొన్నప్పటికీ కదిరి నియో జకవర్గ ప్రజలు తనను రెండు సార్లు గెలిపించి తమ ఆదర అభిమా నాలను చాటుకున్నా రన్నారు. ముఖ్యం గా కదిరి నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం లో అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు సహాయ సహకారాలు అందించి నియోజకవర్గ అభివృద్ధికి తమ వంతు తోడ్పాటును అందిం చాలని కందికుంట పిలుపునిచ్చారు. ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి నంద ్మూరి తారక రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీ నేటి వరకు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుని చిరస్థాయిగా నిలిచిపో యిం దన్నారు. బడుగు బలహీన వర్గాలకు రాజ కీయ భిక్ష ప్రసాదిం చిన ఏకైక పార్టీ ఏదైనా ఉందంటే అది ఒక్క టీడీపీకే దక్కిం దన్నా రు. తెలుగుదేశం పార్టీ జీవనది లాంటిదని అది నిత్యం గంగా, గోదా వరి, కృష్ణ నదుల ప్రవాహ ములా నిరం తరం ప్రజల మనసుల్లో ప్రవహి స్తూనే ఉంటుందన్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర అభివృద్ధి అంధకారంలో కొట్టు మిట్టాడిందన్నారు. ప్రజల జీవితాలతో చెలగాటమాడి అభివృద్ధి సంక్షేమాన్ని నడి సంద్రంలో నావ మునిగేల చేసిన ఘనత మాజీ ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డికే చెల్లిందని కందికుంట ఎద్దేవ చేశారు. ప్రజా జీవనంలో, రాజకీయాలలో నాయకులు వస్తూ పోతూ ఉంటారు కానీ పార్టీ మాత్రం శాశ్వతంగా ఉండిపోతుందన్నారు. సమకాలిన రాజకీయ పరిణామాలు బెరీజు వేసుకుంటే తనను 25 సంవత్సరాలుగా కదిరి నియోజకవర్గ ప్రజ లు ఆదరించి తమ గుండెల్లో నిలుపుకున్నారని వారికి ఎల్లవేళలా రుణ పడి ఉంటానని ఈ సందర్భంగా కందికుంట స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు వహిద్ హుస్సేన్, పార్టీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, మునిసిపల్ చైర్ పర్సన్ దిల్షాదున్నిసా, మున్సిపల్ వైస్ చైర్మన్లు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వా కార్యదర్శి పవన్ కుమార్ రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, మాజీ మహిళా కౌన్సిల్ సభ్యులు పర్వీన్ భాను, మున్సిపల్ కౌన్సిలర్లు ఆల్ఫా ముస్తఫా, రంగారెడ్డి, ఫయాజ్, ఇస్మాయిల్, టిడిపి నాయకులు బాహుద్దిన్, నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట...

ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే.

మినీ మహానాడు సమావేశం హాజరైన కార్యకర్తలు

జీడిపల్లి కాదు..నేడు ఉరవకొండకు రండి అన్నీ చర్చిద్దాం..!

- హంద్రీనీవాకు ఇద్దరు సీఎంలు శంకుస్థాపన చేసిన ప్రదేశంలో చర్చకు సిద్ధం - ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులుకు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సూచన

ఉరవకొండ, మే 20 ప్రభాతవార్త

హంద్రీనీవాపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు బుధవారం ఉరవకొండకు వస్తే ఇద్దరు ముఖ్యమంత్రులు నారా చంద్రబాబునాయుడు, వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి హంద్రీనీవా పథకం పనులను ప్రారంభిస్తూ వేసిన శిలాఫలకాలవద్దే అన్ని విషయాలను చర్చిద్దామని ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మెన్ వై.శివరామిరెడ్డి సూచించారు. మంగళవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

హంద్రీనీవా ప్రాజెక్టు మోదలైనప్పటి నుంచి ఇప్పటివరకు ఏ ప్రభుత్వం ఎంత ఖర్చు చేసిందో చర్చించడానికి తాను సిద్ధంగా ఉన్నానని విప్ కాలవ శ్రీనివాసులు చెప్పినట్టే బుధవారం ఉదయం 11 గంటలకు జీడిపల్లిలో కాకుండా ఉరవకొండలో హంద్రీనీవా శిలాఫలకాలవద్దకు వస్తే తానూ హాజరవుతానన్నారు. ఏ ప్రాంతంలో అయితే ప్రాజెక్టుకు నాంది పడిందో అక్కడే, ఆ ప్రజలు, రైతుల సమక్షంలోనే బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. విప్ కాలువ శ్రీనివాసులు ఉరవకొండకు రావాలని లేదా ఎవరినైనా పంపించినా ఈ విషయమై చర్చకు తాను సిద్ధంగా ఉంటా నన్నారు. ఉరవకొండ పట్టణంలో అయితే ప్ర ్జలు, రైతులు, నాయకులు అందరూ హజ రయ్యేం దుకు రవాణా సౌకర్యం ఉంటుందని బుధవారం విప్ కాలవ శ్రీనివాసులు చర్చకు ఉరవకొండకు రావాలని తాను ఇక్కడ వేచి ఉంటానని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి పేర్కొన్నారు.

వై.శివరామిరెడ్డి

ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెగ్యులారిటీ పనులపై ఎంపీడీవోలు ప్రత్యేక దృష్టి పెట్టాలి కలెక్టర్ టిఎస్ చేతన్

పుట్టపర్తి మే 20 ప్రభాతవార్త :

ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెగ్యులారిటీ పనులపై ఆ మండలాల ఎంపీడీవోలు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ టిఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవోలు ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో మండల స్థాయిలో జరిగే అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ సమత ,డ్రామా పిడి విజయేంద్ర ప్రసాద్, ఆర్డబ్ల్యూ ఎస్ఈ మల్లికార్జునప్ప, వార్డు సచివా లయాల నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి, జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవం ప్రతి నెల మూడో శనివారం నిర్వహించడం జరుగుతుందన్నారు. జూన్ నెలలో నీరు నీరు కార్యక్రమం ఉంటుం దన్నారు. నీటి సంరక్షణ వర్షపు నీరు సేకరణ ,భూగర్భజల వినియోగం, ఇంటింటి నుంచి చెత్త సేకరణ 100 చేపట్టాలన్నారు. వీటిపై ఎంపీడీవోలు పర్యవ ేక్షించాలని నిర్లక్ష్యం చూపితే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజల ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఎక్కడ తాగునీటి పైపులు లీకు కాకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఎక్కడ ఈ ఆటోలు ట్రై సైకిల్లు ట్రాక్టర్ చెత్త సేకరణ పరికరాలు నిరు పయోగంగా ఉండ ్టానికి వీలు లేదన్నారు. అలాంటి పరిక రాలు యంత్రాలు ఎప్ప టికప్పు డు మరమ్మత్తులు చేయిం చి చెత్త సేకరణలో కొన్ని మండ లాలు వెనుకబడి ఉన్నాయని పనితీరు మెరుగు పరుచుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఎం పీడీవోలు డిప్యూటీ ఎంపీ డీవో లు సంబంధిత అధికా రులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్ చేతన్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలిఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

పుట్టపర్తి టౌన్, మే 20, ప్రభాతవాం

ప్రతి కుటుంబానికి ఉపాధి కల్పించేందుకు కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఎమ్మెల్యే సింధూర రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా పుట్టపర్తి పట్టణంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కుట్టు మిషన్ ట్రైనింగ్ సెంటర్ ను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిలు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా ఆరు మండలాల్లో ఉన్న మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అందులో భాగంగానే పట్టణ కేంద్రంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభించడం జరిగిం ద న్నా రు. ఈ శిక్షణ కాలంలో 90 శాతం హాజరు తప్పనిసరిగా ఉండాలని తెలి పారు. కుట్టు మిషన్ శిక్షణ పూర్తి అయితే కుటుంబ పోషన జరగడానికి ఎంతో మేలు జరు గుతుందన్నారు. ఈ శిక్షణ పూర్తయిన తర్వాత కుట్టు మిషన్లను ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

ఎమ్మెల్యే పరిటాల సునీత మేనకోడలుకు అమెరికాలోని వాషు యూనివర్శిటీలో సీటు

- అమెరికాలోని ఎస్.ఎల్. యూనివర్సిటీ, బీబీఏలో 96 మార్కులు - ఈశా చౌదరి ప్రతిభను ప్రసంశించిన ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం, మే 20 ప్రభాతవార్త బ్యూరో

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మేనకోడలు ఈశా చౌదరికి అమెరికాలో టాప్ యూనివర్శిటీల్లో ఒకటైన వాషింగ్టన్ యూనివర్శిటీలో సీటు దక్కింది. ఎమ్మెల్యే సునీత సోదరుడు ధర్మవరపు మురళీ కుమార్తె ఈ శా చౌదరి మొదటి నుంచి అత్యుత్తమ ప్రతిభ చూపుతూ ఇప్పుడు అమె రికాలో కూడా సత్తా చాటుతున్నారు. ఇంటర్ వరకు బెంగళూరులోని ఇండస్ స్కూల్లో చదివి మంచి మార్కులు సాధించారు. అనంతరం అండర్ గ్రాడ్యు యేట్స్ కోసం అమెరికాలోని ఎస్.ఎల్.యూనివర్సిటీలో బీబీఏలో చేరారు. అక్కడ 8 సెమిస్టర్లలో 96శాతం మార్కులతో యూనివర్సిటీలో గోల్డ్ హానర్స్‌గా నిలిచారు. తరువాత ఎంఎస్‌కి బిజినెస్ అనలిటిక్స్‌లో మిస్సోరి సెయింట్ లూస్ స్టేట్ లోని వాషింగ్టన్ యూనివర్సిటీలో సీటు సంపాదించారు. అమెరికాలోని బిజినెస్ యూనివర్సిటీలలో టాప్ టెన్‌గా ఉన్న యూనివర్సిటీల్లో వాషింగ్టన్ యూనివర్శిటీ కూడా ఒకటి. ఇక్కడ సీటు వచ్చినందుకు ధర్మవరపు మురళీ, ధనలక్ష్మి దంపతులతో పాటు వారి కుటుంబసభ్యులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత ఈశా చౌదరిని అభినందించారు. ఈశా మొదటి నుండి చదువులో చురుగ్గా ఉంటోందని, ఎక్కడ చదివినా అక్కడ టాపర్‌గా నిలుస్తోందన్నారు. ఇప్పుడు అమెరికాలో ప్రఖ్యాత యూనివర్శిటీలో సీటు దక్కించు కోవడం ఆనందంగా ఉందన్నారు. ఇలాగే అత్యుత్తమ ప్రతిభ కనబ రుస్తూ మంచి పేరు తీసుకొచ్చే స్థాయికి వెళ్లాలని ఎమ్మెల్యే సునీత ఆకాంక్షించారు.

ఈశా చౌదరి

మెడికల్ కళాశాల మెస్ లో అవినీతిపై రాష్ట్రస్థాయి అధికారుల విచారణ

అనంతపురం వైద్యం మే 20 ప్రభాతవార్త

మెడికల్ కళాశాల మహిళా హాస్టల్ మెస్ లో అకౌంటెంట్ ఓబులేశ్వరి విద్యార్థినిలు చెల్లించే మెస్ బిల్లు మొత్తాన్ని తన వ్యక్తిగత ఖాతాకు మళ్లించి అవినీతికి పాల్పడిన ఘటనపై రాష్ట్ర కేంద్రం నుండి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరసింహన్, అడిషనల్ డైరెక్టర్ అఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ వెంకటేశ్వరరావుల బృందం మంగళవారన జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలకు విచారణకు వచ్చింది. విచారణ బృందం మెడికల్ కళాశాల అధ్యాపకులతో విద్యార్థులతో హాస్టల్ వార్డెన్ మరియు సిబ్బంది ని పిలిచి విడివిడిగా విచారించారు ఈ విచారణలో హాస్టల్ అకౌంటెంట్ ఓబులేశ్వరి విద్యార్థుల సొమ్ము వ్యక్తిగతంగా వాడుతుందని గుర్తించినట్లు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నరసింహన్ తెలిపారు. సదరు అకౌంటెంట్ పై మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మాణిక్యరావు ఏర్పాటుచేసిన విచారణ బృందం ఇచ్చిన విచారణ ప్రతులలో అకౌంటెంట్ సుమారు 40 లక్షలకు పైగా తన వ్యక్తిగత ఖాతాకు డబ్బు మళ్లించిందని ఆ డబ్బును మెడికల్ కళాశాలలో ఎవరెవరికి వాటాలు చెల్లించిందని అంశాలను విచారణ బృందం వివరించినట్లు సమాచారం. ఆరా తీసింది అని సమాచారం. విచారణ బృందానికి అకౌంటెంట్ ఓబులేశ్వరి తన ఖాతా వివరాలను అందించలేదని కావున ఆమెపై పోలీసు కేసు నమోదు చేసి సొమ్ము రికవరీ చేయాలని విచారణ అధికారు లు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌కి సమర్పించిన పత్రాలలో ఉంది ఈ విషయాన్ని డిఎం ఈ పత్రాలను కళాశాల ప్రిన్సిపల్ మాణిక్యరావుకు అందించి త్వరితగతిన చర్యలకు ఉపక్రమించాలని ఆదేశించారు. రాష్ట్రంలో అన్ని మెడికల్ కళాశాల హాస్టల్ మెస్ లకు నిత్యావసరాల సరఫరా కోసం న టెండర్ల ఆహ్వానించనున్నట్లు డిఎం ఈ తెలిపారు. 2007 సంవత్సరం నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు పొందిన ల్యాబ్ టెక్నీషియన్లలో అనర్హులు ఉన్నారని ప్రశ్నించగా సదరు అంశంపై విచారణ జరుగుతుందని వారిలో 27 మందిని అనర్హులుగా తేల్చామని వారిపై త్వరలో చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

విచారణకు వచ్చిన డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరసింహన్

సంక్షేమ పథకాల అమలు 100 శాతం జరగాలి కలెక్టర్ టిఎస్ చేతన్

పుట్టపర్తి రూరల్ మే 20 ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల అమలు 100శాతం జరగాలని కలెక్టర్ టిఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లో అన్ని శాఖల అధికారుల సమావేశం లో పలు పథకాలపై కలెక్టర్ సమీక్షించారు. ఎన్టీఆర్ భరోసా, పెన్షన్ల సక్రమంగా పంపిణీ చేయాలని, అన్నా క్యాంటీన్లలో ఆహార నాణ్యత ను, పరిసరాల పరిశుభ్రతను మున్సిపల్ కమిషనర్లు పరిశీలించాలనీ ఆదేశించారు. పరిశుభ్రతపై డిఎంహెచ్వోలు వైద్య సిబ్బంది పర్యవేక్షణ పర్యవేక్షించాలన్నారు. ఆర్టీసీ బస్టాండులలో మరు గుదొడ్లు పరిశీలించాలని బస్సుల సమయపాలన ఉండేవిధంగా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దీపం పథకం గ్యాస్ డెలివరీ ఏజెన్సీ దారులు లబ్ధిదారుల నుండి అదనపు మొత్తాన్ని వసూలు చేయకుండా చర్యలు చేపట్టా లన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ టి.ఎస్.చేతన్

ఉచిత ఇంటర్ విద్యకు దరఖాస్తు చేసుకోండి..!

మడకశిర టౌన్, మే 20 ప్రభాతవార్త

మడకశిర నియోజకవర్గంలో 10వతరగతిలో 585మార్కులు పైన సాధించిన విద్యా ర్థులకు, మడకశిర పట్టణంలోని పెనుగొండ రోడ్డులో గల శ్రద్ధ ఇన్సైట్స్ జూనియర్ కాలేజ్ లో ఉచితంగా ఇంటర్మీడియట్‌కు పై మార్కులతో అర్హత ఉన్న విద్యా రులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల చైర్మన్ తెలిపారు ఇంటర్ ఉచిత విద్యతో పాటు JEE/ NEET/EAPCET కోచింగ్ ఇవ్వనున్నట్లు కాలే జ్ చైర్మన్ రాధాక్రిష్ణ తెలిపారు. ఇతర ప్రాంతాల్లోని ప్రైవేటు కాలేజీల్లో ఫీజు లు కట్టుకోలేని ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఇది ఒక గొప్ప అవకా శం.అత్యంత తక్కువ ఫీజు తో కార్పొరేట్ కాలేజీలకు ధీటుగా అనుభవజ్ఞులైన అధ్యాపకులతో, జేఈఈ/ నీట్ కోచింగ్ సదుపాయం కలిగిస్తున్నామని, ఈ అవకాశం ఉపయోగించుకొని, మడకశిర విద్యార్థులు తమ సత్తా చాటిచెప్పాలని కళాశాల చైర్మన్ రాధాక్రిష్ణ తెలిపారు.

శ్రద్ధ ఇన్సైట్స్ జూనియర్ కాలేజ్ ,(ఫైల్ ఫోటో)

సీఎం నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం

-పాల్గొన్న రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, మే 20 ప్రభాతవార్త

రాజధాని అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. సుదీర్ఘంగా జరిగిన సమావేశంలో సూపర్ సిక్స్, ఎన్నికల హామీల అమలు, వివిధ ప్రాజెక్టులకు అనుమతులు తదితర అంశాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం దృశ్యం

సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

ఆర్టీసి బస్టాండ్‌ను పరిశుభ్రంగా ఉంచాలి

- చెత్త వేసే షాపులపై జరిమానాలు వసూలు చేయాలి - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, మే 20 ప్రభాతవార్త

ఆర్టీసి బస్టాండ్‌ను పరిశుభ్రంగా వుంచాలని, ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేసే షాపులపై జరిమానాలు ఖచ్చితంగా వసూలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం అనంతపురం నగరంలోని ఏపిఎస్ఆర్టీసి బస్టాండ్‌ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్టాండ్ ఆవరణంలో ఎక్కడపడితే అక్కడ చెత్తను వేయడంతో జిల్లా కలెక్టర్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. డస్ట్‌బిన్లలో వేయకుండా చెత్తను బయట పడేస్తున్నారని, పరిశుభ్రత చర్యలు ఎప్పటికప్పుడు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బస్టాండ్‌లో అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలన్నారు. స్టాల్స్ ఎదుట డస్ట్‌బిన్లను ఏర్పాటు చేయాలన్నారు. స్టాల్స్ ఎదుట డస్ట్ బిన్స్ లేకపోవడంతో వారి నుండి జరిమానాలను వసూలు చేయాలన్నారు. బస్టాండ్ ఆవరణంలోని రెండు షాపులపై 25 వేల రూపాయల చొప్పున జరిమానా విధించి వసూలు చేయా లని, అప్పటివరకు రెండు షాప్‌లను మూసివేయించాలన్నారు. బస్టాండ్ ఆవరణంలోనూ, ప్రతి స్టాల్ ముందు కూడా పరిశుభ్రంగా వుంచాల న్నారు. ఎవరు కూడా బయట చెత్త వేయకు ండా చూడాలన్నారు. డ్రైనేజ్‌ని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాల న్నారు. ఎక్కడపడితే అక్కడ చెతాచెదారం వేయకు ండా చూసుకో వాలన్నారు. బస్సు లు నిలిపే ప్లాట్ ఫారంల వద్ద నేమ్ బోర్డులు స్పష్టంగా కనిపిం చేలా ఏర్పాటు చేయాల న్నారు. బస్టాండ్ ఆవరణంలో వున్న గుంతలను పూడ్చి సిసి రోడ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మరుగు దొడ్లు కూడా అనునిత్యం శుభ్రం చేయిస్తూ వుండాలన్నారు. ఈ సందర్భంగా స్వీపర్లతో మాట్లాడుతూ వారి విధులు నిర్వహించే తీరుపై ఆరా తీశారు. ప్రయాణీకులతో మాట్లాడి సౌకర్యాల గురించి జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి ఆర్ఎం సుమంత్ ఆర్.ఆదోని, నగర పాలక సంస్థ కమీషనర్ బాలస్వామి, డిపో మేనేజర్ నాగభూపాల్, స్టేషన్ మేనేజర్ మూర్తి, డిప్యూటి చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసి అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ

- అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడమే ధ్యేయంగా వెహికల్ చెకింగ్

వాహనాల తనిఖీ చేస్తున్న దృశ్యం

అనంతపురం కలెక్టరేట్, మే 20 ప్రభాతవార్త

జిల్లా వ్యాప్తంగా అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలా పాలకు అడ్డుకట్ట వేయడమే ధ్యేయంగా జిల్లా ఎస్‌పి పి.జగదీష్ ఆదేశాల మేరకు జిల్